విఠలేశ్వర జాతరకు వేళాయె..

- 29న కుభీర్‌లో వేడుకలు
- ఇప్పటికే ప్రారంభమైన తాళసప్తాహం


విఠల, రుక్మాబాయి ప్రతిమలు


మందిరంలో తాళ సప్తాహం నిర్వహిస్తున్న మహరాజ్

కుభీర్: మండలకేంద్రంలోని విఠలేశ్వరస్వామి ఆలయం ఈనెల 29న జరిగే జాతరకు ముస్తాబైంది. భక్తుల కోరికలు తీర్చే మహారాష్ట్రలోని పండరీపురం లో ఉన్న విఠలేశ్వర ఆలయం తర్వాత ఇదే పెద్ద మందిరం. 400 ఏళ్ల కిందట ఈ మందిరాన్ని నిర్మించారని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రతి ఏటా కార్తికపౌర్ణమి తర్వాత వచ్చే అమావాస్య రోజు జాతర నిర్వహించడం ఆనవాయితీ. జాతరకు ఏడు రోజుల ముందు తాళసప్తాహం ప్రారంభమవుతుంది. ఈవారం రోజులు గ్రామంలోని ఆర్యవైశ్యులు.. జాతర రోజు యాదవ, మున్నూరు కాపుకులస్తులు సుమారు 45 క్వింటాళ్ల బియ్యంతో అన్నదానం ఏర్పాటు చేస్తారు. జాతరకు ఒకరోజు ముందు రాత్రి భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టనున్నారు. కుభీర్, జిల్లాలోని వివిధ ప్రాంతాలతోపాటు మహారాష్ట్రలోని పలు గ్రామాల భక్తులు వచ్చి ఈ వేడుకల్లో పాల్గొంటారు.

మందిరంలో జరిగే ఇతర కార్యక్రమాలు..

ఆలయంలో శుక్రవారం జాతరతోపాటు ఇతర పూజలు నిర్వహించనున్నారు. ఏటా రెండుసార్లు ఉట్ల పండుగ నిర్వహిస్తారు. శ్రీరామనవమి, ఉగాది, నాగులపంచమి, దీపావళి, దసరా, గణేశుడి ఉత్సవాలు, దుర్గామాత ఉత్సవాలను ఈ మందిరంలోనే ఏర్పాటు చేస్తారు. గ్రామంలో 90శాతం


ముస్తాబైన మందిరం

ప్రజలు తమ పిల్లల వివాహాలను, పుట్టినరోజు వేడుకలతోపాటు, ఇతర శుభకార్యాలు ఇక్కడే జరిపిస్తారు. స్వాధ్యాయి, హరిటం, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలోనూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్తికమాసంలో నెలరోజులపాటు ఉదయం 5 గంటలకు కాగడ హారతి నిర్వహిస్తారు.

ప్రాంగణంలో ఇతర మందిరాలు..

రెండెకరాల ఆలయ ప్రాంగణంలో గణేశుడి, హనుమాన్, శనేశ్వరుడి ఆలయాలున్నాయి. ఈ మందిరం పక్కనే గ్రామానికి చెందిన స్వామి అనే దేశ్‌ముఖ్ మందిరం ఉంది. పెద్ద వంటశాల, టీటీడీ వారు నిర్మించిన కల్యాణ మండపం ఉండగా.. దానిని ఆలయ కమిటీ వారు అద్దెకు తీసుకున్నారు.

ఏర్పాట్లు పూర్తయ్యాయి..



భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ నెల 22న తాళసప్తాహం ప్రారంభమైంది. మందిరానికి రంగులు వేసి ముస్తాబు చేశాం. భజన మండళ్లవారికి కబురు పంపాం.

– బి.పెంటాజీ, ఆలయ కమిటీ చైర్మన్, కుభీర్

మందిరం తరఫున మరో కల్యాణ మండపం ఉంది. మందిరం చుట్టూ ఉన్న దుకాణ సముదాయాలతో ఆదాయం సమకూరుతుంది. 12 ఎకరాల వ్యవసాయ భూమి ఆలయం పేరిట ఉంది.

అందరి భాగస్వామ్యంతో..

ఆలయ కమిటీని సంవత్సరానికోసారి ఎన్నుకుంటారు. ప్రతి కులం నుంచి ఒక్కొక్కరు చొప్పున సభ్యులుగా ఉంటారు. అన్నికులాలవారు ఇందులో భాగస్వాములై జాతర వేడుకలు, తాళసాప్తాహంను విజయవంతంగా నిర్వహిస్తారు.

పకడ్బందీగా వివరాలు నమోదు చేయండి

ఖానాపూర్: సమగ్ర ఇంటింటి కుటుంబసర్వే వివరాలను పకడ్బందీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల ప్రత్యేకాధికారి, సీపీవో జీవరత్నం అన్నారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డేటా ఎంట్రీ నమోదు ప్రక్రియను పరిశీలించారు. సర్వే కాని చోట ఎన్యూమరేట్లు వెళ్లి.. పూర్తి చేయాలన్నారు. ఈనెల 30లోగా వివరాలను నమోదు చేయాలని సూచించారు. వారి వెంట తహసీల్దార్ శివరాజ్ తదితరులున్నారు.

ముధోల్: సర్వేలో భాగంగా సేకరించిన వివరాలను తప్పుల్లేకుండా పకడ్బందీగా నమోదు చేయాలని డీఎల్‌పీవో సురేందర్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో సర్వే వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. వారి వెంట ఎంపీడీవో


ఖానాపూర్‌లో వివరాల నమోదు ప్రక్రియ పరిశీలిస్తున్న సీపీవో జీవరత్నం

శివకుమార్ ఉన్నారు.

కుభీర్: తప్పులు లేకుండా సర్వే వివరాలను నమోదు చేయాలని తహసీల్దార్ ఎ.సోము, ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్ అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యా


కుభీర్‌లో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన అధికారులు

లయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సర్వే వివరాల నమోదుపై సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

‘దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలి’

భైంసాటౌన్: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు నాడు మాజీ సీఎం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష చారిత్రక ఘట్టమని.. ఈమేరకు ఈనెల 29న నిర్మల్‌లో నిర్వహించే దీక్షా దివస్‌కు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయకర్తలు విలాస్ గాదేవార్, డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముధోల్ నియోజకవర్గంలో పల్సి, బెల్‌తరోడాను కొత్త మండలాలుగా ప్రకటించిందన్నారు. కానీ ఇటీవల రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన 32 కొత్త మండలాల జాబితాలో వీటి ప్రస్తావన లేకపోవడం శోచనీయమన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పర్చడంలో ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి విఫలమయ్యారని


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

పేర్కొన్నారు. విలాస్ గాదేవార్ మాట్లాడుతూ.. భైంసాను మహిషాగా మారుస్తామని భగవద్గీతపై ప్రమాణం చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే అభివృద్ధిని విస్మరించారన్నారు. రానున్న రోజుల్లో రెండు పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. సమావేశంలో నాయకులు దేవిదాస్, పోశెట్టి తదితరులున్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ


లోకేశ్వరం : ధర్మోరలో అభిషేకం చేస్తున్న గురుస్వామి సాయినాథ్

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరలో గురుస్వామి ఏర్రోల్ల స్వామిగౌడ్ ఇంటి ఆవరణలో బుధవారం అయ్యప్ప దీక్షాపరులు మహాపడి పూజ నిర్వహించారు. భైంసా గురుస్వామి సాయినాథ్, లింగారెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప, గణపతి, కుమారస్వామి ప్రతిమలకు పాలు, తేనె, పెరుగు, నెయ్యి, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భైంసా, తానూరు, కుంటాల, లోకేశ్వరం, నర్సాపూర్(జి), ముధోల్, నందిపేట్ మండలాలకు చెందిన 450 మంది స్వాములు పాల్గొన్నారు.

ముధోల్: మండలకేంద్రంలో గురుస్వాములు దత్తు, జీవన్ ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. అయ్యప్పస్వామి విగ్రహాన్ని పాలు, నెయ్యి, పూలతో అలంకరించారు. పడిపూజ కార్యక్రమానికి ముధోల్‌తోపాటు ఆయా గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వాములు మధుస్వామి, భూమేశ్‌స్వామి, సాయినాథ్‌స్వామి, దిగంబర్ స్వామి తదితరులు ఉన్నారు.

ఏరియాస్పత్రిలో పండ్లు, దుప్పట్లు పంపిణీ

భైంసాటౌన్: ముధోల్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిని బి.నారాయణరావు పటేల్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు, అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియాస్పత్రిలో రోగులకు దుప్పట్లు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ రాంచందర్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు షాహిద్, ముత్యంరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కుభీర్, లోకేశ్వరం, తానూరు మండల కేంద్రాల్లో నారాయణరావు పుట్టినరోజును పురస్కరించుకొని ఆ పార్టీ నాయకులు వేడుకలు నిర్వహించారు.

ఈరోజు

పసుపు సాగుపై రైతులకు అవగాహన

సోన్: మండలంలోని న్యూబొప్పారం పంచాయతీ కార్యాలయంలో గురువారం ఉదయం 9 గంటలకు పసుపు పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏఈవో జాదవ్ ఉమామహేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ, ఉద్యానశాఖ శాస్త్రవేత్తలు పాల్గొని ఆధునాతన పద్ధతిలో సాగుపై పలు సూచనలిస్తారని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ సరఫరా బంద్

భైంసాటౌన్: పట్టణంలోని 133కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ ఆదిత్య తెలిపారు. భైంసా, తానూర్, లోకేశ్వరం, కుభీర్, కుంటాల మండలం కల్లూరు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆడదూడలు జన్మించేలా కృత్రిమ గర్భధారణ

సోన్: నూతన సాంకేతికతతో మేలురకం ఆడదూడలు జన్మించేలా పశువులకు కృత్రిమ గర్భధారణ కార్యక్రమం చేపడుతున్నట్లు పశువైద్యాధికారి ఓంప్రకాశ్ అన్నారు. మండలంలోని కడ్తాల్ గ్రామంలో పశువులకు కృత్రిమ గర్భధారణ కోసం వ్యాక్సిన్లు వేశారు. ఈసందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో అందిస్తున్నామని.. రైతులు రూ.250 చెల్లిస్తే.. ప్రభుత్వం రూ.425 చెల్లిస్తుందని పేర్కొన్నారు. దీంతో పాడి పరిశ్రమ అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బాలిక్ హైమద్, రాజనర్సయ్య, గోపాలమిత్ర జంగం సురేందర్ తదితరులు ఉన్నారు.

సీఎంను కలిసిన నాయకులు

బాసర: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముడి కుమార్తె వివాహంలో సీఎం. రేవంత్రెడ్డితో పాటు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కాంగ్రెస్ పార్టీ బాసర మండల అధ్యక్షుడు మమ్మాయి రమేశ్ తనయుడు సచిన్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా సీఎంకు కృతజ్ఞతలు తెలిపినట్లు సచిన్ తెలిపారు.

ఆకట్టుకున్న నృత్యాలు, నాటికలు

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ గ్రామంలో హనుమాన్ సప్తమి పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల నృత్యాలు, నాటికలు, మిమిక్రీ అలరించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముత్తన్న, ఉపాధ్యాయులు ప్రభాకర్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

‘సింహగర్జన’కు రావాలని ప్రచారం

ఖానాపూర్: హైదరాబాద్ మాల మహానాడు ఆధ్వర్యంలో డిసెంబర్ 1న నిర్వహించే సింహగర్జనను జయప్రదం చేయాలని కోరుతూ ఆ సంఘం నాయకులు బుధవారం మండలంలోని సత్తనపల్లి, తర్లపాడ్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన సింహగర్జనకు మాలలు, ఉపకులాల వారు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సుంకరి నర్సయ్య, దామెర శ్రీనివాస్, బక్కన్న, బేరస్వామి, అలపట్ల రాజన్న, కొండా రాజేశ్వర్, బేర గంగాధర్, తిరుమలేశ్, నేత శ్యాం, రాచమల్ల అశోక్,


పోస్టర్‌తో ప్రచారం చేస్తున్న నాయకులు

ద్యావతి రాజేశ్వర్, పి.శ్రీనివాస్, రాజేశ్వర్, సుంకరి లక్ష్మణ్, బేర మల్లేశ్, గోపాల్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

ఖానాపూర్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ డిమాండ్ చేశారు.బుధవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏ గ్రేడ్ వరిధాన్యానికి క్వింటాల్‌కు రూ.3500 చెల్లించాలని డిమాండ్ చేశారు. ధాన్యంలో కోతలు విధించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు డాకూరి తిరుపతి, నాగెల్లి నర్సయ్య, చుంచుల


కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న నాయకులు

నారాయణ, పానగంటి నరేశ్, రాపెల్లి రాజేశ్వర్‌యాదవ్, తదితరులు ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

సోన్: ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో భారతదేశాన్ని ప్రపంచ దేశాల్లో అగ్రభాగాన నిలిపారని బీజేపీ నాయకులు వి.సత్యనారాయణగౌడ్ అన్నారు. బుధవారం మండలకేంద్రంతోపాటు లోకల్‌వెల్మల్, గాంధీనగర్, కడ్తాల్, కూచన్‌పల్లి, సిద్దులకుంట గ్రామాల్లో సభ్యత్వ నమోదు ప్రక్రియ పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బూత్‌కు 200కు పైగా సభ్యత్వాలు చేయాలని కార్యకర్తలకు సూచించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలు గెలిచేలా కార్యకర్తలు కృషి చేయాలని


సభ్యత్వ నమోదులో బీజేపీ నాయకులు

పేర్కొన్నారు. వారి వెంట దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సాగర్, నాయకులు గంగారెడ్డి, నరేశ్, నరసయ్య, నర్సారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

‘అబుల్ కలాం విగ్రహం ఏర్పాటు చేయాలి’

ఖానాపూర్: మున్సిపల్ పాలకవర్గం గతంలో తీర్మానం చేసిన ప్రాంతంలోనే అబుల్ కలాం ఆజాద్ విగ్రహం ఏర్పాటు చేయాలని ముస్లిం సంఘాల జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల విగ్రహం ఏర్పాటు పనులు చేపట్టగా.. మున్సిపల్ కమిషనర్ గుంతను పూడ్చి మైనార్టీల మనోభావాలను దెబ్బతీశారని ఆరోపించారు. మున్సిపల్ చైర్మన్, కమిషనర్ ఖానాపూర్‌లో నెలకొన్న ప్రశాంత వాతావరణం దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖలీల్,


మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

ఇర్ఫాన్, అఖిల్, షోయబ్, సర్జిల్, నసీర్, షకీల్, మెహ్రాజ్, అప్సర్, షాకిర్, రైస్, ఖమర్, అర్షద్, షహీద్, మక్సూద్, వాహబ్, ఇమ్రాన్, అమీర్, జలీల్, రైస్ తదితరులు ఉన్నారు.

పాఠశాలలో నమూనా ఎన్నికలు

సారంగపూర్: రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని బీరవెల్లి జెడ్పీ సెకండరీ పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుడు వై.సాయన్న ఆధ్వర్యంలో నమూనా ఎన్నికలు నిర్వహించారు. అసలు ఎన్నికల మాదిరే వారంరోజుల ముందే రిటర్నింగ్ అధికారిగా భీమాగౌడ్‌ను నియమించి ఎన్నికల నిర్వహణ ప్రకటన జారీ చేశారు. నామినేషన్ల స్వీకరణ, తిరస్కరణ, ఉపసంహరణ తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. పోలీసుల బందోబస్తు, పోలింగ్ ఏజెంట్లు, ఓటు వేసే విధానం, ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. రాజ్యాంగాన్ని ఇచ్చిన హక్కులు పొందడమే కాకుండా మన బాధ్యతలను నిర్వర్తించుకోవాలని సూచించారు. కార్యక్ర


బ్యాలెట్ బాక్సులు తరలిస్తున్న విద్యార్థులు

మంలో పలువురు ఉపాధ్యాయులు మశ్చేందర్, వరలక్ష్మి, ముత్తన్న, శ్రీనివాస్, ఫయాజుద్దీన్, లక్ష్మారెడ్డి, రవికుమార్, మాధవీలత, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, చందర్‌సింగ్, ఎస్.శ్రీనివాస్, సంజు తదితరులు ఉన్నారు.

చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ ఆర్డీవో కల్యాణి విధులకు ఆటంకం కలిగించినవారిపై చర్యలు తీసుకోవాలని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ.. దిలావర్‌పూర్‌లో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా గ్రామస్తుల నిరసన సందర్భంగా వారితో మాట్లాడేందుకు వెళ్లిన ప్రభుత్వ మహిళా అధికారిని ఘెరావ్ చేయడంతో ఆమె అస్వస్థతకు గురయ్యారని వాపోయారు. నిరసనకారులు ఆమె వాహనం ధ్వంసం చేశారని.. దాడి చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

లోకేశ్వరం: మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో 8, 9,10 తరగతుల విద్యార్థులకు బుధవారం మండలస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రత్యామ్నాయ ఇంధనం అంశంపై నిర్వహించిన పోటీల్లో లోకేశ్వరం, రాజూర, గడ్‌చాంద ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరిని జిల్లాస్థాయి ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యాయులు రేగుంట రాజేశ్వర్, చంద్రశేఖర్, దేవేందర్, మురళీధర్, కాశీరాం, సుదర్శన్ ఉన్నారు.

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ ఉన్నత పాఠశాల విద్యార్థులు.. ఇటీవల జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో ద్వితీయస్థానం, కబడ్డీ, నృత్యం పోటీల్లో ప్రథమస్థానంలో


మన్మద్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో సిబ్బంది

నిలిచినట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం మల్కాగౌడ్ తెలిపారు. బుధవారం వీరిని వీడీసీ సభ్యులు, పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినోద్, దేవేందర్, వీడీసీ చైర్మన్ శేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, భోజారాం, గంగకిషన్, సంక్షేమాధికారి సుజాత ఉన్నారు.

క్లుప్తంగా

కేజీబీవీకి స్టాండ్ వితరణ

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని కేజీబీవీకి ఏడోతరగతి విద్యార్థిని అల్లూరి ఆరోహి తల్లిదండ్రులు అల్లూరి కవిత–రమేశ్(కుప్లి) బియ్యం సంచులను నిల్వ చేసేందుకు రూ.12 వేల విలువైన ఇనుప స్టాండును అందజేశారు. వీరిని పాఠశాల ఎస్‌ఓ వీణ, ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కుంటాల: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కల్లూర్ కేజీబీవీ లోని ఉపాధ్యాయులు, సిబ్బంది మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనకు దిగారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ పిలుపు మేరకు నిరసన చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పఠనాసక్తి పెంచేందుకే గ్రంథాలయం


గ్రంథాలయం ప్రారంభిస్తున్న ఎంఈఓ

భైంసారూరల్: విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచే ఉద్దేశంతో పాఠశాలలో గ్రంథాలయం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంఈవో సుభాశ్ అన్నారు. బుధవారం మండలంలోని దేగాం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఎంఈఓ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథప్ప, గ్రంథాలయ కోఆర్డినేటర్ మమత, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

‘కార్తిక’ సంబురం


దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నిర్మల్‌ఖిల్లా: కార్తికమాసం పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని బేస్తవారిపేటకాలనీ శివాలయంలో బుధవారం దీపోత్సవం నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకం, శివసహస్ర నామాలతో అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిదేళ్లుగా ఏటా కార్తికమాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కౌన్సిలర్ ఎడపల్లి నరేందర్ పేర్కొన్నారు.

నిజాయతీ చాటిన ఆలయ సిబ్బంది

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన ఓ భక్తురాలు ఆలయంలో తన పర్సును పాగొట్టుకుంది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన చంప సంబాజీబాయి తన పర్సును పాగొట్టుకోగా.. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌ఎంఆర్ చంద్రమోహన్, హోంగార్డ్ రాథోడ్ కు దొరికింది. వివరాల ఆధారంగా భక్తురాలికి పర్సుతోపాటు అందులో ఉన్న రూ.5వేలు, ఇతర పత్రాలు అందించారు. నిజాయతీ చాటిన సిబ్బందిని కార్యనిర్వహణాధికారి విజయ రామారావు, భక్తులు అభినందించారు.

క్షేత్ర పర్యటనలో విద్యార్థులు


చెట్లు పరిశీలిస్తున్న విద్యార్థులు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని సహకార జూనియర్ కళాశాల విద్యార్థులు.. బుధవారం క్షేత్ర పర్యటనలో భాగంగా తిర్పెల్లి గ్రామం వెళ్లారు. బైపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, వృక్షశాస్త్రం అధ్యాపకులు జె. శ్రీనివాస్ పలు చెట్ల పూలు, ఆకులను సేకరించారు. హెర్బేరియం కలెక్షన్‌లో భాగంగా ఒక్కొక్కరు 25 రకాల మొక్కలు సేకరించారు. మొక్కల శాస్త్రీయ, సాధారణ నామాలు వివరించినట్లు అధ్యాపకుడు తెలిపారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన

బాసర: మండలంలోని దొడాపూర్‌లో ప్రీ యూనిక్ ఇండియా ఆయిల్‌పాం కంపెనీ ఆధ్వర్యంలో ఉద్యానశాఖ అందిస్తున్న రాయితీలపై భైంసా డివిజన్ ఏరియా మేనేజర్ శేఖర్ రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పాం సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. మండల క్లస్టర్ ఆఫీసర్ సంతోష్, మాజీ సర్పంచ్ దీపక్, గ్రామరైతులు సుభాశ్, పీ రాజీ, మహదేవ్, సురేశ్ పాల్గొన్నారు.